క్లుప్తంగా

30న కల్యాణ కామేశ్వరి మంత్రహోమం



హోమం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్, ఈవో, పాలక మండలి సభ్యులు

తిరుపతి కల్చరల్: శ్రీతాత్తయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈ నెల 30వ తేదీన తొలిసారిగా కల్యాణ కామేశ్వర మంత్ర హోమం చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్ తెలిపారు. ఆయన ఆదివారం కల్యాణ కామేశ్వర మంత్ర హోమం కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వివాహం కాని వారికి వివాహ శుభలగ్నం కలిగించేందుకు కల్యాణ కామేశ్వర మంత్ర హోమం చేపట్టడం ఆనవాయితీ అన్నారు. ప్రస్తుతం ఈ కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం విజయవాడలోని శ్రీకనకదుర్గ ఆలయంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. పరివ్రాజకాచార్య శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి ఆశీస్సులతో టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆదేశాల మేరకు ఆలయంలో ఈ కల్యాణ కామేశ్వర మంత్ర హోమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ హోమం ఇకపై ప్రతి నెలా ఆలయంలో నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు 30వ తేదీన ఉదయం 9 నుంచి 11.45 గంటల వరకు హోమం జరుగుతుందన్నారు. వివాహం కాని యువతీ యువకులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులతో కల్యాణ శుభలగ్నం పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు వి.క్రిష్ణమ్మ, ఎస్.భారతి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ గ్రామోత్సవం




శ్రీమూలస్థాన ఎల్లమ్మ పంచలోహ విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ బాలాలయ మహోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం అమ్మవారి పంచలోహ విగ్రహానికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సోమ వారం తెల్లవారుజామున బాలాలయ ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఇందులో ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు అవాహిత కలశ పునపూజలు, 3.55 గంటలకు కర్కాటక లగ్నంలో అమ్మవారి దారు ప్రతిష్ట, పంచలోహమూర్తి చర ప్రతిష్ట, కుంభ కళాన్యాసం, మార్జనలు, నేత్రోన్మీలణం, గో, దర్ప, కన్యా, సర్వదర్శన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ఈవో పుట్టా రామకృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వయంభు మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహుకాల సమయంలో రాహుకేతు, సర్వదోష నివారణ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని ఆలయ అధికారులకు ఇస్తున్న వరప్రసాద్

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి ఆదివారం యాదమరి మండలం కుక్కలపల్లెకు చెందిన వరప్రసాద్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. దాత, కుటుంబసభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

శంఖు, చక్రం సమర్పణ

చౌడేపల్లి: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ వీరాంజనేయస్వామికి మండలంలోని తొప్పిరెడ్డిపల్లెకు చెందిన జె.జయకుమార్‌రెడ్డి, నిర్మల దంపతులు ఆదివారం శంఖు, చక్రం సమర్పించారు. కోరిన కోర్కెలు ఫలించడంతో ఆలయానికి పంచలోహంతో శంఖు, చక్రం తయారు చేయించి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు మునిరాజ, అర్చకుడు కృష్ణమూర్తికి అందజేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం

- ఏకగ్రీవమైన పలు సర్పంచ్, వార్డుమెంబర్ల స్థానాలు
- జీడీనెల్లూరు మండలం వరత్తూరులో వైఎస్సార్‌సీపీ మద్దతుతో వార్డుమెంబర్ నాగరాజు ఘన విజయం
- సంక్షేమ పథకాలే గెలిపించాయంటున్న ప్రజాప్రతినిధులు





కత్తెరపల్లి సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న నవీన, (ఇన్‌సెట్) నెల్లేపల్లి సర్పంచ్‌గా గంగయ్య

కార్వేటినగరం: ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయ దుందుభి మోగించారు. మండలంలోని కత్తెరపల్లి, నెల్లేపల్లి పంచాయతీలకు సర్పంచ్‌లుగా నామినేషన్ దాఖలు చేసుకున్న చంద్రగిరి నవీన, కే.గంగయ్య ఏకగ్రీవంగా ఎంపిక అయినట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. వార్డు మెంబర్ల స్థానాలకు నామినేషన్లు వేసిన 9 మందిలో ఏడుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గంగాధరనెల్లూరు మండలం వరత్తూరు గ్రామంలోని 2వ వార్డుకు ఎన్నికలు నిర్వహించడంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన నాగరాజు 48 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి టీ.ముద్దుకృష్ణపై గెలుపొందారు. అదేవిధంగా పాలసముద్రం మండలం కృష్ణజమ్మాపురం పంచాయతీలో 10వ వార్డుకు చెందిన పవన్‌కల్యాణ్(టీడీపీ మద్దతుదారు) పోటీలో లేకపోవడంతో ఆ స్థానం కూడా ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో రేఖ(కార్వేటినగరం), శేఖర్(కొండేపల్లి), విజయ(గంగాధరనెల్లూరు), ఎస్.చాందిని(శ్రీరంగరాజపురం), టీ.మురగమ్మ(తయ్యూరు), కే.మౌనిష(నెళవాయి), ఈ.రవికుమార్(గిడ్డమహారాజపురం) వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

భారీగా విజయోత్సవాలు..

ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీలో నిలిచిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఏకగ్రీవం కావడంతో అంతటా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఏకగ్రీవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమమే కారణమని అన్నారు. ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.7 లక్షల వరకు లబ్ధి పొందారని. అందుకే వైఎస్సార్‌సీపీ విజయ దుందుభీ మోగించిందన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట బాణా సంచలు పేల్చి సర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. అలాగే ఎన్నికల అధికారులు సర్పంచ్, వార్డుల సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించారు.



నాగరాజును సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



నాగరాజును సన్మానిస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

జగనన్నను మరోమారు సీఎంను చేసుకుందాం

గంగాధరనెల్లూరు: మండలంలోని వరత్తూరు గ్రామ పంచాయతీలోని వార్డు మెంబరు స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేసిన కాశీపల్లికి చెందిన నాగరాజు 48 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదివారం తన నివాసంలో నాగరాజును ఘనంగా సన్మానించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఇదే ఉత్సాహంతో ప్రతిఒక్కరూ పని చేసి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మునిరాజారెడ్డి, దాము, హరీష్ పాల్గొన్నారు.

ఇదే ఉత్సాహంతో పని చేయండి..

వరత్తూరు గ్రామ పంచాయతీలోని వార్డు మెంబరుగా పోటీ చేసి వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన నాగరాజు ఆదివారం ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయానందరెడ్డి శాలువా కప్పి నాగరాజును ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఇదే ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి గడపలో సంక్షేమ కాంతులు



లబ్ధిదారురాలికి సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- పథకాలకు అర్హత ఉన్న ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి చేకూర్చాము
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి: గతంలో ఎన్నడూ లేనివిధంగా నేటి జగనన్న ప్రభుత్వంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం సాయంత్రం నగరి పట్టణ పరిధిలోని సత్రవాడ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆరోగ్యశ్రీ పథకం ఆదుకుందా ? అమ్మ ఒడి అందుతోందా అంటూ ఆరా తీశారు. అందరూ అన్నీ అందుతున్నాయని ఆనందంగా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ మరమగ్గ కార్మికుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రజలకు వందశాతం సంక్షేమం, అభివృద్ధి జరగాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు.

చంద్రబాబువి మోసపూరిత హామీలు..

ఎన్నికల సమయంలో అమలు చేయలేని అబద్ధపు హామీలు గుప్పించే చంద్రబాబునాయుడును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. సీఎం జగనన్న ఇచ్చిన హామీలనే కాకుండా, మేనిఫెస్టోలో లేని వాటిని కూడా ప్రజలకు అందించారని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. ఇలా పలు విధాలుగా ప్రజలకు చేయూతనిస్తున్న నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రోజా నివాసంలో తేనీరు స్వీకరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి

మంత్రుల మంతనాలు

ఈ నెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరికి విచ్చేస్తున్న విషయం విదితమే. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో అటు అధికారులు, ఇటు పార్టీ కేడర్ నిమగ్నమయ్యారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆదివారం జిల్లామంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కళత్తూరు నారాయణస్వామి నగరిలోని నగరిలోని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఇంటికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి రోజా సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు తేనీటి విందు స్వీకరించారు. అనంతరం పర్యటన ఏర్పాట్లపై చర్చలు జరిపారు.

దోమలతోనే రోగాల వ్యాప్తి

గంగాధరనెల్లూరు: దోమలు కుట్టడంతోనే ఒకరు నుంచి మరొకరికి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సీహెచ్‌ఓ శ్రీనివాసులు తెలిపారు. ప్రపంచ దోమల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రం జీడీనెల్లూరు పురవీధుల్లో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఇంటి పరిసరాలను, చుట్టు పక్కల ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల ద్వారా వ్యాధులు ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి ఆవరణల్లో నిల్వ ఉంచిన టైర్లు, కొబ్బరిచిప్పల వల్ల దోమలు అధికం అవుతాయని, అలాంటివి నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మనోహర్, జయమ్మ, పుష్పలత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తహసీల్దారుకు వినతి

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని రామకృష్ణాపురంలో జరుగుతున్న పోలాక్షమ్మ ఉత్సవాల్లో వివక్ష చూపడం సరికాదని, దీనిపై అధికారులు తమకు న్యాయం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై వారు ఆదివారం తహసీల్దార్ పరమేశ్వరస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి లేని వివక్ష ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. రామకృష్ణాపురం దళితవాడకు అమ్మవారి ఊరేగింపు రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, వెంకటేష్, నందయ్య, బాబి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్ర తప్ప వివక్ష లేదు..

రామకృష్ణాపురంలో దళితుల పట్ల వివక్షత చూపుతున్నారు అంటూ కొందరు చేస్తున్న వాదనల్లో వాస్తవం లేదని స్థానిక దళిత నాయకుడు మురళి స్పష్టం చేశారు. కొందరు రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం కొంతమందిని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఇక్కడి ఏడు గ్రామాల రైతులు అందరినీ గౌరవిస్తున్నారని, పోలాక్షమ్మ ఆలయంలో తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మునిరామయ్య, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలాల పరిశీలన



ఆలయాలకు కేటాయించిన స్థలాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, ఏఈ హేమంత్

శ్రీరంగరాజపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆలయ నిర్మాణాలకు కేటాయించిన స్థలాలను జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, దేవదాయ శాఖ ఏఈ హేమంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సహకారంతో, డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో మండలంలోని ఆలయాలు లేని 18 గ్రామాలను గుర్తించి, అక్కడ ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రభుత్వం దేవదాయ శాఖ ద్వారా ప్రతి ఆలయానికి రూ.10 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఆలయాలను ధ్వంసం చేస్తే నేడు జగనన్న హిందు ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అన్ని మతాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సముచితం ఇస్తున్నారని అన్నారు. ఇంకా ఆలయాలు లేని గ్రామాలు ఏవైనా ఉంటే ప్రభుత్వం ఆలయాలను మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జనార్ధన్, మణి, గండు, యువరాజ్, నవీన్, రాజేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గుణశేఖర్



గుణశేఖర్

వెదురుకుప్పం: లయన్స్ క్లబ్ మండల శాఖ అధ్యక్షుడిగా సోక్రటీస్ ఇంగ్లిష మీడియం స్కూల్ కరెస్పాండెంట్ గుణశేఖర్‌ను ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షుడు పేట హరికృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని దేవళంపేట ఇంగ్లిష మీడియం స్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ మండల శాఖ కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యదర్శిగా నరసింహా రెడ్డి, ట్రెజరర్‌గా పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యక్షుడిగా యుగంధర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా దయాకర్ రెడ్డి, డైరెక్టర్లుగా కిరణ్ యాదవ్, వెంకటరమణారెడ్డిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన గుణశేఖర్ మాట్లాడుతూ పదవి రావడం పట్ల ఆనందంగా ఉందని అయితే మరింత సామాజిక బాధ్యత పెరిగినట్లు చెప్పారు. సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జోనల్ చైర్‌పర్సన్ రామచంద్రారెడ్డి, పాస్ట్ గవర్నర్ భక్తవత్సల రెడ్డి, ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చంద్రశేఖర్‌రెడ్డి, సెకండ్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు అశ్వర్థ, నారాయణ, రాజారెడ్డి, పేట ధనంజయ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ కుటుంబానికి పరామర్శ



లక్ష్మమ్మ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణమ్మ, మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీపేట గ్రామానికి చెందిన తుడా అడ్వైజర్ శివాల దామోదరరెడ్డి తల్లి శివాల లక్ష్మమ్మ(85) గత వారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం లక్ష్మమ్మకు తమ స్వగ్రామమైన ఆర్కేవీబీ పేటలో నిర్వహించిన కర్మక్రియలకు ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణమ్మ, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా గ్రామానికి విచ్చేసి హాజరై లక్ష్మమ్మకు నివాళులు అర్పించారు. అనంతరం తుడా అడ్వైజర్ శివాల దామోదర్‌రెడ్డి ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, లోకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మునస్వామి రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువత అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, సర్పంచ్‌లు దివ్య, ధనంజయ వర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, శేషాద్రి, సుధాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, పట్టాభిరెడ్డి, గోపీనాథ్ పాల్గొన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం..

మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్పకు కార్వేటినగరం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం వారు కార్వేటినగరం మీదుగా ఆర్కేవీబీ పేటకు వెళ్తుండగా ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కార్వేటినగరంలో పెద్దఎత్తున బాణసంచా పేల్చి ఘన స్వాగతం పలికి, శాలువలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించారు.

రేణిగుంటలో జాతర సంబరం



గంగమ్మ తల్లి మూలవిరాట్



రేణిగుంట గంగమ్మ ఆలయం



రేణిగుంటలో విద్యుత్ వెలుగులు

రేణిగుంట: మండలకేంద్రం రేణిగుంటలో గంగ జాతర మూడు రోజులపాటు వైభవంగా జరగనుంది. సోమవారం ఉదయం గెరిగె ఊరేగింపు, మంగళవారం గంగమ్మ జాతర మహోత్సవం, గంగమ్మ ఆలయం ప్రాంగణంలో సామూహిక పొంగళ్లు, నైవేద్యం సమర్పణ, నడివీధి గంగమ్మ ఎదుట అంబళ్లు, అమ్మవారి మూలవిరాట్ విశ్వరూప దర్శనం ఏర్పాట్లు జరగనున్నాయి. బుధవారం నడివీధి గంగమ్మ ఎదుట అమ్మవారి ప్రతిష్ట, అమ్మవారి మహాదర్శన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా మూడు రోజుల పాటు ఎంతో వైభవంగా జరిగే ఈ జాతర మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివస్తారు. ఈసారి కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేశారు.

వైభవంగా కల్యాణోత్సవం



శ్రీకాళహస్తీశ్వర స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో శ్రీకాళహస్తి ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు ఆలయంలో పలు హోమాలు, అభిషేకం, స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆలయంలో పూజలు..

శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు దంపతులు, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి తదితరులు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. సర్పంచ్ సుబ్రమణ్యం, నాయకులు రాజేంద్ర, దినేష్ యాదవ్, మునిరాజా పాల్గొన్నారు.